అన్వేషించి.. అప్పగించి

- గత కొన్ని నెలల్లో 304 అదృశ్యం కేసుల ఛేదన
- బాధిత కుటుంబాల్లో ఆనందం

➡ నగరానికి చెందిన ఓ బాలిక ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ప్రేమ ఆకర్షణలో పడి ఓ యువకుడితో వెళ్లిపోయింది. బాధిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతికత ఆధారంగా బాలిక ఆచూకీని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

➡ బీవీనగర్‌కు చెందిన ఓ యువకుడు అప్పుల పాలై ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు యువకుడి ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

➡ సైదాపురానికి చెందిన ఓ బాలిక అపరిచిత వ్యక్తి మాయమాటలు నమ్మి వెళ్లగా అతను అసభ్యంగా ప్రవర్తించాడు. బాధిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బాలిక ఆచూకీని గుర్తించి సదరు వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.


యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారి (ఫైల్)

నెల్లూరు(క్రైమ్) : వ్యక్తుల అదృశ్యం ఘటనలు బాధిత కుటుంబాల్లో అంతులేని ఆవేదనను మిగులుస్తున్నాయి. తమ వారు బతికున్నారో? తిరిగి వస్తారో? రారో అని నిత్యం ఆలోచనలతో సతమతమవుతారు. తమవారి ఆచూకీ తెలియజేయాలని ప్రతి సోమవారం జరిగే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆ తరహా ఫిర్యాదులు అధికమయ్యాయి. మిస్సింగ్ కేసులపై ఎస్పీ జి.కృష్ణకాంత్ ప్రత్యేక దృష్టి సారించారు. సర్కిల్స్ వారీగా మిస్సింగ్ కేసులపై పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. గడిచిన కొన్ని నెలల్లో సివిల్, ఏహెచ్‌టీయూ పోలీసులు సాంకేతికత ఆధారంగా అదృశ్యమైన 304 మందిని సంరక్షించి బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రధాన కారణాలు

తెలిసీ తెలియని వయస్సులో ప్రేమకు ఆకర్షితులవడం, కుటుంబ కలహాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మందలించారని, ఒత్తిడితో కూడిన చదువులు, ఉపాధి, ఉద్యోగాల్లో ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులు, వివాహేతర సంబంధాలు, వ్యసనాలకు బానిసలుగా మారడం, సామాజిక మాధ్యమాల ప్రభావం, మానసిక బలహీనతలు అదృశ్యం కేసులకు కారణాలుగా నిలుస్తున్నాయి.

రోజుకు ఇద్దరు లేదా ముగ్గురు

పోలీస్ శాఖ లెక్కల ప్రకారం జిల్లాలో రోజుకు సగటున ఇద్దరు నుంచి ముగ్గురు వ్యక్తులు అదృశ్యమవుతున్నారు. ప్రధానంగా 15 నుంచి 22 ఏళ్లలోపు అబ్బాయిలు, అమ్మాయిలు అదృశ్యమైన ఘటనల్లో అధికశాతం ప్రేమ వ్యవహారాలుండగా, మరికొన్ని ఘటనల్లో మిత్రులతో కలవనీయకపోవడం, అడిగిన డబ్బు ఇవ్వకపోవడం, సెల్‌ఫోన్ వాడకంపై నియంత్రణ వంటి కారణాలు వినిపిస్తున్నాయి.

ఎక్కువగా..

➡ 25 నుంచి 40 ఏళ్లలోపు మహిళల విషయానికొస్తే కుటుంబ సభ్యుల ఒత్తిడి, తమ అభిప్రాయాలకు విలువ ఇవ్వడం లేదని, ఆలుమగల నడుమ సఖ్యతలేక బయటకు వచ్చేస్తున్నారు. సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉన్నా వాటిని పెద్దవిగా చేసుకుంటున్నారు.

➡ వృద్ధుల విషయానికొస్తే కొందరు నిరాదరణకు గురవుతుండగా.. మరికొందరు ఒంటరితనం అనే భావనకు లోనవుతున్నారు. ఆరుపదుల వయస్సు దాటడం, భార్య లేదా భర్త చనిపోవడంతో మానసికంగా బలహీనంగా మారిపోతున్నారు. అనారోగ్యానికి లోనవుతున్నారు. మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి వెళ్లిపోతున్నారు.

ప్రేమ మోజులో....

చదువు, ఒత్తిడి, ఇతరత్ర విషయాలు ఒక కారణమైతే అధికశాతం మంది ప్రేమమోజులో పడి ఇళ్ల నుంచి పారిపోతున్నారు. పరిణితి చెందని వయస్సులో ఆకర్షణకు లోనై ప్రేమనే తప్పటడుగు వేసి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. ఈ తరహా అదృశ్యం కేసులు ఎక్కువవడం కలవరపాటుకు గురిచేస్తున్నాయి. బాలికలు, యువతుల అదృశ్యం ఘటనల్లో సెల్‌ఫోన్ల ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. సామాజిక మాధ్యమాలు ద్వారా అపరిచిత వ్యక్తులతో పరిచయాలు చేసుకుంటున్నారు. వారు ఎలాంటి వారో తెలియకుండానే యువతీ, యువకులు, వివాహితలు దగ్గరవుతున్నారు. వారి మోజులోపడి అయిన వారిని వదిలి వెళ్లిపోతున్నారు.

అవగాహన విస్తృతం

జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలు, అపార్ట్‌మెంట్లు, బహిరంగ ప్రదేశాల్లో పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలను సైతం అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నారు. కౌమార, యవ్వన దశలో యువత ఆలోచనలు వేగంగా ఉంటాయి. తమకిష్టమైన రీతిలో ఉండాలని ప్రయత్నిస్తారు. సహచరులతో పోల్చుకుని విలాసవంతమైన జీవనం సాగించాలనుకుంటారు. ఇలాంటి సమయాల్లో తల్లిదండ్రులు వారి ఆలోచలను అర్థం చేసుకోవడంతో పాటు వారి అభిప్రాయాలను గౌరవించాలి. వారికి మంచి, చెడుల గురించి వివరించాలి. వారు ఇష్టమైన రంగంలో రాణించేందుకు ప్రోత్సహించాలని పోలీసులు సూచిస్తున్నారు. అక్రమరవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే డయల్ 112, చైల్డ్ లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గడిచిన కొన్ని నెలల్లో..

	అదృశ్యం	ఛేదన
బాలికలు	88	82
మహిళలు	151	135
బాలురు	21	18
పురుషులు	99	68
మొత్తంగా	359	304

ప్రత్యేక దృష్టి పెట్టాం



మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాం. ఫిర్యాదు అందిన వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నాం. సైబర్, ఐటీకోర్ సిబ్బంది సహకారంతో మిస్సింగ్ అయిన వారిని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నాం.

– జి.కృష్ణకాంత్, ఎస్పీ


తప్పిపోయిన బాలుడిని తల్లిచెంతకు చేర్చిన పోలీసులు (ఫైల్)

మర్యాదపూర్వకంగా..


కలెక్టర్ ఆనంద్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న హరికృష్ణ

నెల్లూరురూరల్ : జిల్లా సైనిక సంక్షేమాధికారిగా బాధ్యతలు చేపట్టిన జి.హరికృష్ణ కలెక్టర్ ఆనంద్‌ను ఆయన చాంబర్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

అనుబంధ విభాగాలకు అధ్యక్షుల నియామకం

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించినట్లు కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు వచ్చాయి. ఇందులో వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్‌కు వి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మహిళా విభాగానికి పోతురాజు రమాదేవి, రైతు విభాగానికి ఆళ్ల మనోహర్‌రెడ్డి, బీసీ సెల్‌కు కరణాల వంశీకృష్ణ, ఎస్సీ సెల్‌కు తొగురు జాషువా, ఎస్టీ సెల్‌కు మల్లిక రవికుమార్, మైనార్టీ సెల్‌కు ఎస్‌కే అబ్దుల్‌రజాక్, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు దాసరి సుజన్‌రవీంద్రబాబు(రాజేష్), విద్యార్థి విభాగానికి ఎస్.రోహిత్‌రెడ్డి, పంచాయతీ రాజ్‌కు బండ్ల రాజేంద్రప్రసాద్, మున్సిపల్ వింగ్‌కు నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి, ఆర్టీఐ వింగ్‌కు కె.సుకుమార్‌రెడ్డి, వలంటీర్స్ వింగ్‌కు తాతా శ్రావణ్, గ్రీవెన్స్ సెల్‌కు బి.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వాణిజ్య విభాగానికి కె.సతీష్, వీవర్స్ వింగ్‌కు సప్రమ్ రవి, ఇంటలెక్చువల్స్ ఫోరమ్‌కు పుల్లూరు చంద్రమౌళి, వైఎస్సార్‌టీయూసీకి సీహెచ్ నవీన్‌కుమార్‌రెడ్డి, అంగన్‌వాడీ వింగ్‌కు ఎ.షాలిని తబిత, లీగల్‌సెల్‌కు కాటూరు విద్యాధర్‌రెడ్డి, కల్చరల్ వింగ్‌కు ఎస్.శారద, సోషల్ మీడియాకు షేక్.నయముతుల్లా, ఐటీ వింగ్‌కు చింతం జనార్దన్‌రెడ్డి, పబ్లిసిటీ వింగ్‌కు ఎ.వినోద్‌కుమార్‌రెడ్డి, డాక్టర్స్ వింగ్‌కు డాక్టర్ పి.జీవన్, బూత్ కమిటీకి ఎ.వెంకటసుబ్బారెడ్డి, దివ్యాంగుల విభాగానికి సాదు పెంచలరెడ్డిలను నియమించారు.

క్లుప్తంగా

ఉర్దూ పాఠశాలల విలీనం తగదు


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆవాజ్ కమిటీ నాయకులు

నెల్లూరు(అర్బన్) : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మోడల్ పాఠశాలల్లో ఉర్దూ మీడియం పాఠశాలలను విలీనం చేసి మైనార్టీలకు అన్యాయం చేయవద్దని ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.రషీద్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూభాష అంతరించకుండా కాపాడాలన్నారు. ప్రతి మోడల్ పాఠశాలలో ఇద్దరు ఉర్దూ టీచర్లను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో మైనార్టీల కోసం బాలికల గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని విన్నవించారు. అక్కచెరువుపాడు వద్ద ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలకు రోడ్లు వేయాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న జాకీర్ హుస్సేన్ జయంతి, వర్ధంతులను ప్రభుత్వం నిర్వహించాలన్నారు. వెంకటేశ్వరపురం వద్ద ఉన్న జాకీర్ హుస్సేన్ విగ్రహం వద్ద దెబ్బతిన్న కాంపౌండ్‌ను పునర్నిర్మించి గేట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ సీనియర్ నాయకులు రియాజ్, అన్వర్ పాల్గొన్నారు.

వారికి మాట్లాడే అర్హత లేదు

నెల్లూరు(సెంట్రల్) : మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలను విమర్శించే అర్హత వారికి లేదని డిప్యూటీ మేయర్ పి.రూప్‌కుమార్ అన్నారు. నెల్లూరులోని ఆయన కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గతంలో పార్టీ మారిన వారిని పక్కన పెట్టుకుని మంత్రిని, ఎమ్మెల్యేలను విమర్శించడం సరికాదన్నారు.

జెడ్పీ సీఈఓ ఆకస్మిక తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ మోహన్‌రావు

కొడవలూరు : జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి(సీఈఓ) మోహన్‌రావు నార్తురాజుపాళెం సచివాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరును పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వపరంగా అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఇండస్ట్రీస్, సిటిజన్ మిస్సింగ్, అక్షరాస్యత సర్వేల గురించి పలు ప్రశ్నలడిగారు. ప్రజలకు అందిస్తున్న సేవలకు సంబంధించి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కొడవలూరు ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి 15వ ఆర్థిక సంఘ నిధుల వినియోగం, బోర్ వెల్స్ ఫిర్యాదులకు సంబంధించిన రికార్డులు, ఇతరత్రా కార్యాలయ రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ప్రభుత్వపరమైన అన్ని రికార్డులు పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు, కార్యాలయ సూపరింటెండెంట్ రాంప్రసాద్, ఈఓపీఆర్డీ సాయిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి విజయ్ ఉన్నారు.

పాపం దివ్యాంగులు

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గ స్థాయిలో పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సదరం సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతోంది. సోమవారం నుంచి అధికారులు ఈ ప్రక్రియను ప్రారంభించారు. ఐదు మండలాలకు చెందిన 2,133 మంది తమ సర్టిఫికెట్లను చూపించారు. ఈ నేపథ్యంలో దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారు ఆందోళన చెందుతున్నారు. తమ పెన్షన్‌ను నిలిపివేస్తారోననే భయం పట్టుకుంది. ఇదిలా ఉండగా దూరప్రాంతాల నుంచి వచ్చే దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సహాయకులుగా కుటుంబ సభ్యులు ఎవరూ లేని వారు బంధువులు లేదా స్నేహితులను బతిమిలాడుకుంటున్నారు. నడవలేని పరిస్థితుల్లో ఉన్న వారిని కుటుంబ సభ్యులే వీల్‌చైర్‌పై తీసుకెళ్తున్నారు.

వైభవంగా హనుమంత వాహనసేవ

పొదలకూరు: పట్టణంలోని అయ్యప్పనగర్ శ్రీదేవి, భూదేవి కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్లను హనుమంత వాహనంపై ఊరేగించారు. ఉదయం వివిధ పూజా కార్యక్రమాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి 7.30 గంటలకు గరుడ వాహనసేవ, 8 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ బి.మాలకొండారెడ్డి, అల్లూరు రమణయ్య తదితరులు పర్యవేక్షించారు.

ఆర్‌పీఐ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా మాబు

నెల్లూరు సిటీ : రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా ఎస్‌కే మాబును నియమిస్తున్నట్లు పార్టీ నేషనల్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మోహన్‌లాల్ పాటిల్ తెలిపారు. నగరంలోని వీఆర్సీ సెంటర్‌లో ఉన్న హోటల్ అనురాగ్‌లో పార్టీ శ్రేణులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌లాల్ పాటిల్ మాట్లాడుతూ అంబేడ్కర్ స్థాపించిన పార్టీలో పనిచేసే ప్రతి ఒక్కరూ రాజ్యాంగానికి కట్టుబడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సౌతిండియా ప్రెసిడెంట్ పి.అంజయ్య, రాష్ట్ర అధ్యక్షుడు పిట్ట వరప్రసాద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పండు బాలకృష్ణ, జిల్లా పార్టీ నాయకులు పాల్గొన్నారు.



విప్ ధిక్కరించిన వారిపై చర్యలు చేపట్టాలి

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున



నెల్లూరు(బారకాసు) : డిప్యూటీ మేయర్ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ జారీ చేసిన విప్‌ను ధిక్కరించిన కార్పొరేటర్లపై చర్యలు తీసుకునేంత వరకు తమ ప్రయత్నం కొనసాగించడంతో పాటు ప్రజాక్షేత్రంలో దోషులుగా నిలబెడుతామని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున అన్నారు. నగరంలోని రాంజీనగర్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ సిటీ కార్యాలయంలో ఆయన బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ మేయర్ ఎన్నికలో టీడీపీ నేతలు రాజ్యాంగాన్ని అపహస్యం చేసి ప్రజల దృష్టిలో నవ్వుల పాలయ్యారన్నారు. అధికార పార్టీ నేతలు రాజ్యాంగ విలువలను కాలరాశారన్నారు. వైఎస్సార్‌సీపీ విప్ జారీ చేసిన విషయంపై రూప్‌కుమార్ తెలిసింది గోరంత తెలియనిది కొండంత ఉందన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. డిప్యూటీ మేయర్ ఎన్నికలో టీడీపీ తరఫున బీఫారం ఇవ్వలేని దుస్థితిలో ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. రాజ్యాంగం గురించి రూప్‌కుమార్ తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఇప్పటికే విప్ ధిక్కరించిన కార్పొరేటర్లతో పాటు డిప్యూటీ మేయర్‌గా ఉన్న రూప్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలియజేశామని, వారు పట్టించుకోకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించి పదవిలో ఉండగానే అనర్హత వేటు వేసేలా చేస్తామన్నారు. నారాయణ గతంలో కూడా మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల్లో కనీసం డిపాజిట్ కూడా రాలేదని, అయితే వైఎస్సార్‌సీపీ తరఫున ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విజయం సాధించి చరిత్ర సృష్టించారన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలు మాకిచ్చిన గౌరవాన్ని కాపాడుకుంటూ వారి పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేస్తామని స్పష్టం చేశారు.

కళాకారులను ప్రోత్సహించాలి


విశ్రాంత ఏఎస్సై అంకిరెడ్డికి సన్మానం

నెల్లూరు(బృందావనం) : ప్రతిఒక్కరూ కళాకారులను ప్రోత్సహించాలని కేతా సుబ్బారావు అన్నారు. నర్తకిసెంటర్‌లో కళాకారుడు, విశ్రాంత ఏఎస్సై జి.అంకిరెడ్డిని బుధవారం ఆయన సత్కరించి 'కళారత్న' బిరుదును అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావేదిక ఐదో వార్షికోత్సవంలో భాగంగా సీనియర్ కళాకారులను తమ వంతుగా సన్మానిస్తున్నామన్నారు. కళాకారులను ఆదరించి తగిన ప్రోత్సాహం అందించాలన్నారు. కార్యక్రమంలో తబలిస్ట్ ఆనంద్, కళాకారులు వి.మహేష్, మారి, పి.అమానుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

8న సినీ సంగీత గాంధర్వం


ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో ఫిబ్రవరి 8న ప్రేమ సౌధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'సినీ సంగీత గాంధర్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు నల్లమల్లి సత్యనారాయణ తెలిపారు. అందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను నర్తకి హాల్ ప్రాంగణంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంను స్మరిస్తూ సీనియర్ గాయకులతో మధుర గీతాలాపన సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు జరుగనుందన్నారు. అలాగే కళారంగానికి విశిష్ట సేవలందించిన వారిని సత్కరించనున్నామన్నారు. సమావేశంలో రఘురామిరెడ్డి, అంకిరెడ్డి, అమానుల్లాఖాన్, కేతా సుబ్బారావు, ఆనంద్, మారి పాల్గొన్నారు.

ఇద్దరి అదృశ్యంపై కేసు నమోదు


జి.గురవారెడ్డి

నెల్లూరు(క్రైమ్) : నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటనలపై ఆయా ప్రాంత పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. వెంకటేశ్వరపురం పాలడెయిరీ ప్రాంతంలో జి.గురవారెడ్డి నివాసం ఉంటున్నారు. ఆయన గత కొంత కాలంగా మతిస్థిమితం సరిగ్గాలేక బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 1న ఆయన ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమయ్యాడు. బాధిత కుటుంబసభ్యులు అతని కోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు. ఈ మేరకు కుమారుడు బాలయ్య బుధవారం రాత్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి మందలించారని..

తండ్రి మందలించాడని కుమారుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. వివరాల్లోకి వెళ్తే.. జెండావీధి సమీపంలోని బొందిలివీధిలో సయ్యద్ అహ్మద్ నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. ఇందులో మూడో సంతానమైన సయ్యద్ ఫైరజ్ హుస్సేన్ ఓ బ్యాంక్‌లో హోమ్‌లోన్ ఏజెంట్‌గా పనిచేస్తున్నారు. ఈనెల మూడో తేదీ రాత్రి డబ్బుల విషయంలో తండ్రి, కుమారుల నడుమ వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో అహ్మద్ కుమారుడిని మందలించాడు. ఈక్రమంలో ఫైరజ్ పనిమీద వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అప్పటి నుంచి అతని జాడ తెలియరాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ ఉంది. ఈ మేరకు తండ్రి బుధవారం రాత్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రిని కలిసిన కలెక్టర్

నెల్లూరు(సెంట్రల్) : దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలెక్టర్ ఆనంద్ బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు ప్రజలకు చేరేలా చూడాలని పేర్కొన్నారు.

ఈ–క్రాప్ బుకింగ్ పరిశీలన



కోవూరు : మండలంలో ఈ–క్రాప్ బుకింగ్‌ను ఆర్డీఓ అనూష బుధవారం పరిశీలించారు. కోవూరు సచివాలయం–2 పరిధిలో రీసర్వే జరుగుతుందని, వాటిని రైతులు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. విమర్శలు రాకుండా అధికారులు సర్వే చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ నిర్మలానందబాబా, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

వెన్నుపోటుదారుల వ్యాఖ్యలు అర్థరహితం



మాట్లాడుతున్న వీరి చలపతిరావు

- పార్టీ మారిన కౌన్సిలర్లు రాజీనామా చేయాలి
- డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు

నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ గుర్తుతో ఎన్నికల్లో గెలుపొంది నేడు అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితమని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు, విడవలూరు మండలాల పార్టీ కన్వీనర్లు, బుచ్చి కౌన్సిలర్లతో డైకస్ రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. బుచ్చి నగర పంచాయితీలో జరిగిన వైస్ చైర్మన్ ఎన్నికలో తమ పార్టీ జారీ చేసిన విప్‌ను కొందరు కౌన్సిలర్లు ధిక్కరించారని, వారిపై అనర్హత వేటు వేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలుపొంది అధికార పార్టీకి మద్దతు తెలిపిన కౌన్సిలర్లు తమ పదవులకు రాజీనామా చేయాలన్నారు. ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, బెజవాడ వంశీధర్‌రెడ్డి తమ పార్టీలో పదవులు పొంది ఇప్పుడు టీడీపీలోకి వెళ్లి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వంశీధర్‌రెడ్డి ప్రస్తుతం తిరుగుతున్న కారు విడవలూరులోని ఎస్టీ వర్గానికి చెందిన వ్యక్తికి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సదరు కారుకు ఎల్లో నంబర్‌ప్లేట్‌ను తొలగించి వైట్ నంబర్‌ప్లేట్ వేసుకుని దర్జాగా తిరుగుతున్నారని, ఆర్టీఓ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తమ నాయకుడు ప్రసన్నకుమార్‌రెడ్డి 2012లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరి తిరిగి ఎన్నికల్లో గెలిచిన వ్యక్తి అని.. మీలా ఒకపార్టీ గుర్తుపై గెలిచి పదవిలో కొనసాగుతూ రాజీనామా చేయకుండా వేరే పార్టీలో కొనసాగడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇలా వ్యవహరిస్తున్న వారు తమ నేతలు గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. సమావేశంలో పార్టీ నేత మేనకూరు సీతారామిరెడ్డి, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ విజయ్ కుమార్, మండల కన్వీనర్లు సతీష్‌రెడ్డి, షాహుల్, శేషగిరిరావు, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో సాగాలి



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఎమ్మెల్సీ, అపస్మా నేతలు

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం) : విద్యార్థులు ఓ లక్ష్యంతో ముందుకు సాగాలని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపస్మా) జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని పురమందిరంలో మైథిలి మనోహర్‌రెడ్డి టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ కరస్పాండెంట్ ఎస్ఆర్కే కృష్ణమూర్తిని, పలువురు ఎంఈఓలు, అపస్మా నేతలను సన్మానించారు. అదేవిధంగా ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం పర్వతరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకోవాలన్నారు. అపస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తులసి విష్ణుప్రసాద్, రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.